క్లుప్తంగా

టీటీడీకి పది టన్నుల కూరగాయలు



కూరగాయల వాహనం ముందు శ్రీవారి సేవకులు

పలమనేరు: పలమనేరుకు చెందిన శ్రీవారి సేవకులు కర్ణాటక రాష్ట్రంలోని పలు మార్కెట్లలో సేకరించిన పదిటన్నుల కూరగాయలను ప్రత్యేక వాహనంలో శనివారం తిరుమల నిత్యాన్నదాన పథకానికి పంపారు. గత కొన్నేళ్లుగా తాము రైతులు, మండీ యజమానుల నుంచి కూరగాయలను సేకరించి తిరుమల నిత్యాన్నదానానికి పంపుతున్నట్లు శ్రీవారి సేవకులు తెలిపారు. తొలుత కూరగాయల వాహనానికి పూజలు చేసి తిరుమలకు పంపించారు. నిర్వాహకులు కాబ్బిల్లి రవి, గోపాల్ రెడ్డి, మధు, సురేష్, శ్రీకాంత్, సోమశేఖర్ నాయుడు పాల్గొన్నారు.

సురేష్‌కు అచీవర్స్ అవార్డు



అవార్డు అందుకున్న సురేష్‌కుమార్

పుంగనూరు: పట్టణంలోని ఆర్య వైశ్య సంఘ నేత, వ్యాపారి అమరావతి సురేష్‌కుమార్‌కు ఇంటర్నేషనల్ అచీవర్స్ అవార్డును అందజేశారు. శనివారం పట్టణంలో రాజస్థాన్‌కు చెందిన జ్ఞాన ఉదయ్ ఫౌండేషన్ వారు ఈ అవార్డు ప్రదానం చేశారు. సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నందుకు అవార్డును అందజేశారు. పలువురు హర్షం వ్యక్తం చేశారు.

కీలపట్లలో అన్నదానం



పలమనేరు : గంగవరం మండలం కీలపట్లలో టీటీడీ అనుబంధంలో ఉన్న ప్రముఖ శ్రీకోనేటి రాయస్వామి ఆలయంలో శనివారం అన్నదానం చేశారు. పట్టణానికి చెందిన దాత జీవన్ సాయి ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. ఆలయంలో అన్నదానం చేయదలచిన వారు ముందురోజు పేరు నమోదు చేసుకోవాలని టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గజేంద్ర తెలిపారు.

బీమా నగదు పంపిణీ

పెద్దపంజాణి: మండలంలోని శివాడి గ్రామానికి చెందిన వి.విశ్వనాథ్ కుటుంబానికి శనివారం వైఎస్సార్ బీమా తక్షణ సాయాన్ని అందజేశారు. విశ్వనాథ్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన భార్య అనూరాధకు వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా రూ.10 వేలను ఏఎంసీ డైరెక్టర్ సురేష్ అందజేశారు.

నేత్ర చికిత్సా శిబిరానికి స్పందన



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్

బైరెడ్డిపల్లి : బైరెడ్డిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో చెన్నై శంకరనేత్రాలయ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత నేత్ర చికిత్సా శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో 60 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో 16 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ప్రతి నెలా ఉచిత నేత్ర శిబిరం నిర్వహిస్తుండడంతో గ్రామీణ ప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వేడుకగా విగ్రహ ప్రతిష్ఠాపన



సదుం: మండలంలోని ఊటుపల్లె పంచాయతీ చల్లావారిపల్లెలో నూతనంగా నిర్మించిన శ్రీకోదండ రామస్వామి ఆలయంలో శనివారం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, కలశస్థాపన, కుంభాభిషేకం నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. తీర్థప్రసాదాల వినియోగం జరిగింది.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

బంగారుపాళెం: స్థానిక ఎస్పీసీ నాయుడు పార్కు వద్ద ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర చౌదరి తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ఎస్పీసీ నాయుడు కుటుంబ సభ్యుల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. శ్రీ వెంకటేశ్వర అరవింద్ కంటి ఆస్పత్రి వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారన్నారు.

పల్లెకు సచివాలయ మకుటం

గ్రామీణ ప్రాంతాల అభ్యున్నతితోనే అభివృద్ధి సాధ్యమన్న మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయాలతో సాకారమైంది. పల్లె ప్రజల అవసరాలు, కష్టాలు తీర్చేలా ఏర్పాటు చేసిన సచివాలయాలు, వలంటీరు వ్యవస్థలతో పూర్తి పారదర్శకంగా.. నేరుగా జనం గడపలోకే సేవలు అందుబాటులోకి వచ్చాయి. పింఛన్ నుంచి ఇంటి పట్టా వరకూ ఏది కావాలన్నా, నీటి సమస్య నుంచి రెవెన్యూ సమస్యల వరకూ, సర్టిఫికెట్ల నుంచి శిశు సంక్షేమం వరకూ అన్ని పనులూ గ్రామ సచివాలయాల ద్వారానే పూర్తవుతుండడంతో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

- సాకారమవుతున్న జాతిపిత కల
- పల్లె ముంగిటకు ప్రభుత్వ యంత్రాంగం
- మండల కేంద్రం చుట్టూ తిరిగే కష్టాలకు తెర
- లబ్ధిదారులకు సమయం, ఖర్చు ఆదా
- అందుబాటులో 540 సేవలు



చిన్నారిదొడ్డిలోని గ్రామ సచివాలయం

శాంతిపురం: సచివాలయాలు సేవాలయాలుగా జనం మన్ననలు అందుకుంటున్నాయి. 2019 అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా మండలంలో 20 గ్రామ సచివాలయాలు ఏర్పాటయ్యాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల కోసం మారుమూల గ్రామాల నుంచి ప్రజలు మండల కేంద్రం చుట్టూ తిరిగే కష్టానికి వీటితో తెర పడింది. సచివాలయాల ద్వారా గ్రామ స్థాయిలోనే జనం బాధలు, అవసరాలు తీర్చే పటిష్టమైన యంత్రాంగం అందుబాటులోకి వచ్చింది. దీనికి అనుబంధంగా గ్రామ వలంటీరు వ్యవస్థ తోడు కావడంతో సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవడం, వాటిని అందుకోవడం వంటివి ఇంటి ముంగిటనే సాధ్యం అవుతోంది. గతంలో పనులు మానుకుని వ్యయ, ప్రయాసలతో మండల కేంద్రానికి వెళ్లినా కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. కానీ సచివాలయాల ద్వారా ఒకే ప్రాంగణంలో దాదాపు 35 ప్రభుత్వ శాఖల పనులు చేయించుకునే అవకాశం కలిగింది. ప్రతి సేవకు నిర్ణీత సమయాన్ని ప్రభుత్వం నిర్దేశించడంతో సచివాలయ సిబ్బంది గడువు లోపే ఆయా పనులు పూర్తి చేస్తున్నారు. అన్ని పథకాల లబ్ధిదారుల జాబితాలను పారదర్శకంగా నోటీసు బోర్డుల్లో ప్రదర్శిస్తున్నారు.

శాంతిపురం మండల సచివాలయాల వివరాలు

గ్రామ సచివాలయాలు :	20
సచివాలయ భవనాలు :	20
సచివాలయ సిబ్బంది :	128
అందుబాటులోని శాఖలు :	35
అందుబాటులోని సేవలు :	540
పొందిన సేవలు :	37,014
ఆధార్ కేంద్రాలున్న సచివాలయాలు :	3

మండలకేంద్రానికి వెళ్లే బాధ తప్పింది



గతంలో కార్యాలయాల్లో ఏ పని కావాలన్నా 15 కిలోమీటర్లు ప్రయాణించి శాంతిపురానికి రావాల్సి వచ్చేది. ఒక్కోసారి రోజంతా అక్కడే గడపాల్సి వచ్చేది. ఆఫీసరు అదుబాటులో లేకున్నా, పని పూర్తి కాకున్నా మళ్లీ మళ్లీ మండల కేంద్రం చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ బాధలు తప్పాయి. ఎలాంటి కష్టం లేకుండా ఇంటి దగ్గర్లోనే గ్రామ సచివాలయంలో అన్ని పనులు త్వరగా పూర్తి అవుతున్నాయి. సమయం ఆదా కావడంతో ఇతర సొంత పనులకు ఇబ్బంది లేదు.

– ప్రసన్నకుమార్, 64 పెద్దూరు

త్వరగా పనులు చేస్తున్నారు



సచివాలయంలో అధికారులు చాలా మంది యువకులే ఉన్నారు. ఏదైనా పనిమీద వెళ్తే పెద్దల పట్ల మర్యాదగా మాట్లాడుతూ, త్వరగా పనులు చేస్తున్నారు. గతంలో మండల ఆఫీసుకు పనిపై వెళ్తే అన్ని ఊర్ల నుంచి మన లాగే జనం అక్కడికి రావడంతో పనులు చేయటానికి ఇబ్బందిగా మారి అధికారులు కసురుకునేవారు. ఇప్పుడు ప్రశాంతంగా ఊర్లోనే పనులు పూర్తి అవుతున్నాయి. ఆఫీసుల్లో పనుల కోసం శాంతిపురం చుట్టూ తిరిగే ఖర్చులు ఆదా అయ్యాయి.

– వెంకటమునెప్ప, రామనాథపురం

దేశానికే ఆదర్శంగా సంక్షేమ పథకాలు



రామకుప్పంలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్సీ భరత్ అన్నారు. శనివారం మండల కేంద్రం రామకుప్పంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని అడిగారు. పథకాల లబ్ధిని వివరిస్తూ సంక్షేమ బావుటా బుక్‌లెట్‌లను అందజేవారు. సమస్యలను తెలుసుకున్నారు. రామకుప్పంలోని అన్ని వీధుల్లో సిమెంటు రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జగనన్న లే అవుట్‌లో అర్హులకు ఇంటి పట్టాలు పంపిణీ చేయాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. నవరత్నాల పథకాల లబ్ధితో ద్వారా పేద, బడుగు, బలహీన, అట్టడుగు వర్గాల ప్రజలు ఆర్థికంగా ఎదిగారని పేర్కొన్నారు. కుప్పం నియోజకవర్గ అభివృద్ధిపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని బలపరచాలని కోరారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, పార్టీ కో–కన్వీనర్ చంద్రారెడ్డి, సర్పంచ్ మురళీకృష్ణ, పార్టీ టౌన్ అధ్యక్షుడు అప్పి, నేతలు తజ్ముల్ పాషా, జమీను ప్రసాద్, అబ్దుల్, నారాయణస్వామి, తప్రోజ్ బాషా, యశ్వంత్ రెడ్డి, గణేష్ రెడ్డి, దయానందం, ఆర్బిట్, మునీంద్ర, అధికారులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



జేడీతాండా సదస్సులో మాట్లాడుతున్న మురళి

పుంగనూరు: గ్రామీణ ప్రాంత ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని, దోమలను కట్టడి చేయాలని ఆరోగ్య విస్తరణాధికారి మురళి తెలిపారు. శనివారం మండలంలోని పాల్యెంపల్లె, జెడి తాండలో డెంగీ, చికున్‌గున్యా, మలేరియా, సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా 32 మందికి ఆరోగ్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ దోమల నివారణకు మస్కిటో కాయల్స్ లేదా వేపాకు పొగ వేయాలని తెలిపారు. ఇంటి వద్ద నీటి నిల్వలు లేకుండా చూడాలని తెలిపారు. సిబ్బంది చంద్రావతి, ధనలక్ష్మి, గజరాజు, తేజోమూర్తి, ఆశ వర్కర్లు అఫ్సనా, గౌతమి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం



పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

పెద్దపంజాణి: ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. శనివారం మండలంలోని పెద్దకాప్పల్లె సచివాలయ పరిధిలోని బందార్లపల్లె, జిట్టంవారిపల్లె, గౌరీనగర్, ఆకులవారిపల్లె, బేరుపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.ఈగ్రామాల్లో 480 ఇళ్లకు వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. పథకాల లబ్ధిని వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అవినీతికి తావులేకుండా సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థలతో సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు తెలిపారు. కుల, మత, వర్గాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఇంటి వద్దకే అందిస్తుండడంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ఎక్కడ పేరు వస్తుందోనని టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ ఓర్వలేక విషం చిమ్ముతున్నారని ఆరోపించారు. చంద్రబాబు ఎన్ని పార్టీలతో పొత్తులు పెట్టుకున్నా రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే తపనతో టీడీపీ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తూ ఆర్థికంగా ఆదుకుంటున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాలని ప్రజలు ఎదురు చూస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాగా రెడ్డి, వైస్ ఎంపీపీలు జీడీ బాబు, అంజమ్మ, సింగిల్ విండో చైర్మెన్ ఓబుల్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శులు తమ్మిరెడ్డి, మాకయ్య, సుహేబ్, ఏఎంసీ డైరెక్టర్ సురేష్, స్థానిక సర్పంచ్ చంద్రమోహన్, ఎంపీటీసీ సభ్యురాలు పావని, నాయకులు భాస్కర్‌రెడ్డి, రాజా రెడ్డి, ఆంజిరెడ్డి, జయరామ్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

15న మార్కెట్ కమిటీ షాపుల వేలం

పుంగనూరు: పట్టణంలోని మార్కెట్ కమిటీ సముదాయంలోని నాలుగు షాపులను ఈనెల 15న వేలం వేయనున్నట్లు కార్యదర్శి గోపి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టిస్టాల్, ఫలహారశాల, రెండు కూల్‌డ్రింక్స్ షాపులను ఏడాది కాలపరిమితితో లీజుకు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వ్యాపారులు ఒక్కొక్క షాపునకు రూ.25 వేల ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. నిబంధనల మేరకు వేలం నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

స్కూళ్ల వద్దే బస్సు పాసులు

పుంగనూరు: ప్రభుత్వాదేశాల మేరకు విద్యార్థులకు పాఠశాలల వద్దే బస్సు పాసులను అందజేస్తామని మదనపల్లె–2 డిపో మేనేజర్ నిరంజన్ శనివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12వ తేదీన పాఠశాలలు తెరుస్తారని, అదే రోజున ఆయా పాఠశాలల వద్ద ఉచిత, రాయితీ పాసులను విద్యార్థులకు అక్కడిక్కడే అందజేస్తామని పేర్కొన్నారు. ఇందుకోసం విద్యార్థులు గతంలో తీసుకున్న బస్సు పాసు, ఐడి కార్డు, స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు జిరాక్స్ ప్రతులతో పాటు రెండు ఫోటోలు ఇవ్వాలని తెలిపారు. ఈ సౌకర్యాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు.

కండక్టర్లకు క్యాష్ అవార్డులు



కండక్టర్లను అభినందిస్తున్న డీఎం రామకృష్ణ

పలమనేరు: పలమనేరు డిపోలో మే నెలకు సంబంధించి అత్యధిక ఈపీకే(ఎర్నింగ్ ఫర్ కిలోమీటర్) సాధించిన కండక్టర్లను డీఎం రామకృష్ణ అభినందించారు. శనివారం డిపోలో జరిగిన సమావేశంలో ఎక్స్‌ప్రెస్ సర్వీసులో గుప్త, పల్లెవెలుగులో మణికి ఆయన క్యాష్ రివార్డులను అందజేసి అభినందించారు. డిపో అభివృద్ధికి కృషి చేశారంటూ కొనియాడారు. పలువురు కండక్టర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

తాగునీటి మోటార్ కేబుల్ చోరీ



కత్తిరించిన కేబుల్ వైరు

పలమనేరు: గంగవరం మండలం పొన్నమాకులపల్లెలో శుక్రవారం రాత్రి తాగునీటి బోరు మోటార్ కేబుల్ చోరీ అయ్యింది. మోటార్ నుంచి స్టార్టర్ వరకు లాగిన 50 మీటర్ల కేబుల్‌ను గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. కీలపల్లె పంచాయతీ పొన్నమాకులపల్లె అవతలి వైపున గ్రామానికి సంబంధించిన తాగునీటి బోరు ఉంది. గ్రామంలో సగం భాగం నివాసాలకు ఈబోరు నుంచే తాగు నీటి సరఫరా అవుతోంది. కేబుల్‌ను కరిగించి అందులోని రాగిని దుండగులు రూ.వేలకు విక్రయిస్తున్నారు. గతంలో ఇదే బోరు వద్ద కేబుల్ చోరీకి గురైందని, ఇది రెండోసారని సర్పంచ్ రెడ్డెప్పరెడ్డి తెలిపారు. ఇదే గ్రామం వైఎస్సార్ జగనన్న కాలనీ బోరులో దాదాపు వంద మీటర్ల కేబుల్ వైర్లు సైతం దొంగలు తస్కరించినట్లు తెలిపారు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో, విద్యుత్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

14న తిమ్మరాయస్వామి కుంభాభిషేకం



ముస్తాబైన తిమ్మరాయ స్వామి దేవస్థానం

కుప్పం: పట్టణ సమీపంలోని గుత్తార్లపల్లెలో వెలసిన స్వయంభూ శ్రీప్రసన్న తిమ్మరాయస్వామి ఆలయ జీర్ణోద్ధారణ, కుంభాభిషేకం మహోత్సవం ఈనెల 14 తేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు. ఆదివారం ప్రతిష్ఠాపనకు సిద్ధంగా ఉన్న వినాయక, మహాలక్ష్మి, తిమ్మరాయస్వామి విగ్రహాలను ఏడు గ్రామాల్లో ఊరేగించనున్నట్లు తెలిపారు. గుత్తార్లపల్లె, కోటపల్లె, బిజ్జిగానిపల్లె, పచ్చార్లపల్లె, గుండ్లసాగరం, కుప్పం, డీకేపల్లెలో మంగళవాయిద్యాల మధ్య ఊరేగింపు జరుగుతుందని పేర్కొన్నారు. సోమవారం గణపతి హోమం, అంకురార్పణ, ధ్వజారోహణం ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. మంగళవారం గోపుర కలశ ప్రతిష్ఠ, మధ్యాహ్నం అన్నదానం, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. 14వ తేదీ తిమ్మరాయస్వామి విగ్రహ ప్రతిష్ఠ, మహాకుంభాభిషేకం మహోత్సవ విశేష పూజలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా ముస్తాబు చేశారు. పురాతన దేవాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో పునర్నిర్మించినట్లు తెలిపారు.

ఆదర్శ మండలంగా తీర్చిదిద్దాలి



ఎంపీపీ యువరాజుతో కలసి కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

వి.కోట: మౌలిక వసతుల్లో ఎటువంటి లోటు పాట్లు లేకుండా.. సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ ఆదర్శ మండలంగా తీర్చిదిద్దాలని ఎంపీపీ యువరాజుకు ఎమ్మెల్యే వెంకగౌడ సూచించారు. శనివారం మండలంలోని ఎంపీపీ స్వగ్రామమైన పసలమందలోని యువరాజును ఆయన నివాసంలో ఎమ్మెల్యే కలిసారు. మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధికార్యక్రమాలు, చేపట్టాల్సి పనులపై చర్చించి పలు సూచనలు చేశారు. అనంతరం ఎంపీపీ జన్మదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే సత్కరించి, కేక్ కట్ చేశారు. పలువురు ప్రజాప్రతినిధులు ఎంపీపీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

బాక్సింగ్‌లో మహేష్‌కు అవార్డు



పుంగనూరు: పట్టణానికి చెందిన మోహన్‌మురళి కుమారుడు రెడ్డిమహేష్‌కు కరాటే, బాక్సింగ్‌లో అద్భుత నైపుణ్యం ప్రదర్శించినందుకు నేషనల్ అచీవర్స్ అవార్డు అందుకున్నారు. శనివారం సోషియల్ పాయింట్ ఇండియా సంస్థ ప్రతినిధులు ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

మహిళ ఆత్మహత్య



హయతున్నీసా

పలమనేరు: పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన షఫీఖాన్ కుమార్తె హయతున్నీసా(24) శుక్రవారం రాత్రి ఆత్మహత్య చేసుకుంది. ఈమె పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పనిచేస్తుండేది. ఆమెను భర్త వదిలివేయడంతో కలత చెంది ఇంట్లో దూలానికి ఉరివేసుకుంది. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ సుబ్బారెడ్డి శనివారం తెలిపారు.

ముగిసిన వేసవి శిక్షణ



పలమనేరు: ప్రశంసాపత్రాలను అందజేస్తున్న గ్రంథాలయ అధికారి



ప్రశంసాపత్రం అందుకుంటున్న విద్యార్థిని

పలమనేరు: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు 34 రోజులుగా సాగిన వేసవి విజ్ఞాన శిక్షణ శనివారంతో ముగిసింది. గ్రంథాలయాధికారి హేమకుమార్ మాట్లాడుతూ డ్రాయింగ్, పెయింటింగ్, స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్, కథలు, చెస్, యోగా తదితరాలను నేర్పించామన్నారు. నేర్చుకున్న అంశాలపై పోటీలను నిర్వహించి, ప్రతిభ చూపిన పిల్లలకు ప్రశంసాపత్రాలను ఆయన పంపిణీ చేశారు. పందరి కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

గంగవరం మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో నెల రోజులు పాటు విద్యార్థులకు నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం శనివారం ముగిశాయి. గ్రంథాలయాధికారి శ్రీకాంత్‌రెడ్డి, తెలుగు సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసినాథం నాయుడు ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రంథాలయాలకు తరచూ వెళ్లి పుస్తకాలు పఠనం అలవాటు చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని పేర్కొన్నారు. చిత్రలేఖనం, వ్యాసరచన, కథలు, పద్యాలు, వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు.

వినాయకుని సేవలో అనకాపల్లి ఎంపీ



స్వామివారి చిత్రపటం అందుకుంటున్న ఎంపీ దంపతులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామిని అనకాపల్లి ఎంపీ సత్యవతి శనివారం రాత్రి దర్శించుకున్నారు. రాత్రి ఎంపీ కుటుంబ సభ్యులతో కలసి విచ్చేయగా ఆలయ ఈఓ వెంకటేశు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం వేదపండితులు ఎంపీ దంపతులకు ఆశీర్వచనం అందించారు. అధికారులు స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో నాణ్యమైన దిగుబడి

గుడిపాల: పంటల సాగులో విత్తనశుద్ధి కీలకం. సరైన జాగ్రత్తలతో విత్తనశుద్ధి చేస్తే చీడపీడల నివారించి సస్యరక్షణ సాధించవచ్చు. చిత్తూరు నియోజకవర్గంలో ఖరీఫ్ సీజన్‌లో 11 వేల హెక్టార్లలో వివిధ పంటలు సాగుచేస్తున్నారు. ఇందులో అత్యధికంగా 4 వేల హెక్టార్లకు పైగా వేరుశనగ, 270 హెక్టార్లలో వరి, 900 హెక్టార్లలో చెరకు పంటలను రైతులు సాగు చేసే పనిలో ఉన్నారు. ఇప్పటికే ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాల ద్వారా సబ్సిడీ వేరుశనగ విత్తనాలను రైతులకు అందజేసింది.

గుడిపాల మండలంలో 1,120 క్వింటాళ్లు, చిత్తూరు మండలంలో 870 క్వింటాళ్ల విత్తనకాయలను పంపిణీ చేసింది. వేరుశనగ సాగుకు సిద్ధమవుతున్న రైతులు విత్తనశుద్ధి చేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచనలు ఇస్తున్నారు.

వేరుశనగ విత్తనశుద్ధి ఇలా...

- ఒక కేజీ వేరుశనగ విత్తనానికి 3 గ్రాముల బావిస్టన్ లేక ఎం.45. లేదా సాఫ్‌పౌడి కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి. దీంతో మొలకలు బాగా పెరిగి తెగుళ్లు రాకుండా నివారిస్తుంది.
- శుద్ధికి వినియోగించే మందులు విత్తనంలోకి చొచ్చుకొని పోయి శిలీంద్రాలను నాశనం చేస్తాయి. విత్తనశుద్ధి తర్వాత మొలకెత్తిన లేత మొక్కలు నేలలో ఉన్న శిలీంద్రాల నుంచి రక్షణ పొందుతాయి. దీంతో తక్కువ ఖర్చుతో పంటకు తెగుళ్ల, చీడపీడలు సోకకుండా చూసుకోవచ్చు.
- విత్తనశుద్ధిలో తగిన మోతాదులో మాత్రమే మందులు వాడాలి. మోతాదుకు మించి ఉపయోగిస్తే విత్తనం మొలకెత్తే శాతం దెబ్బతింటుంది.
- విత్తనశుద్ధి చేసేటప్పుడు రైతులు ముఖానికి మాస్కులు, చేతులకు తొడుగులు తప్పనిసరిగా ధరించాలి.
- విత్తనసాగు తరువాత 25లేక 35 రోజుల్లోపు ఆకుపచ్చ తెగుళ్ల సోకకుండా కాంటఫ్ మందును స్ప్రే చేయాలి.
- 90 రోజుల తరువాత బావిస్టన్‌ను స్ప్రే చేస్తే ఆకు బలంగా దృఢంగా ఉండి మంచి దిగుబడికి సాధ్యమవుతుంది.
- మరిన్ని వివరాలకు గుడిపాల, చిత్తూరు వ్యవసాయ కార్యాలయం లేక గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లో సంప్రదించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

రసాయనిక ఎరువులు తగ్గించాలి

వేరుశనగ విత్తనం సాగుచేసుకునే ముందు విత్తనశుద్ధి తప్పకచేసుకోవాలి. పంట సాగు అనంతరం మోతాదుకు మించి ఎరువులు, మందులు ఉపయోగించకూడదు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలి. విత్తనాలు కొనుగోలు చేస్తే తప్పక బిల్లులు పొందాలి. స్థానిక రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించి పంటసాగులో సలహాలు, సూచనలు పొందాలి.

– మాధవి, వ్యవసాయాధికారి, గుడిపాల